# "వధువు కావాలి"



బి.ఎస్.మూర్తి

"అమ్మా, నేనే చెప్పేను కదుటే. ఆ పేపరు వాళ్ళకి డబ్బు పారేస్తే చాలు. ఎంచక్కా వేసేరో ఎడ్వర్టయిజుమెంటు" అంటూ ఇంట్లోకి పరుగెత్తింది తార.

అప్పుడే పూజకి అన్నీ సిద్ధం చేసుకొని ఆచమనం చేసుకుంటూంది, తల్లి. పేపరు మాట వినగానే పూజ మాట మరచిపోయి ఎంత లావు మనిషి అయినా సునాయాసంగా ఇటు తిరిగి "వేసేడూ? ఏం వేసేడు? వెయ్యకేం జేస్తాడులే డబ్బు పడ్డాక? ఏం—వూరకనే వేస్తే ఏం పోయిందో? వాడి పేపరుకే పేరు వస్తుందిగా మంచి పెళ్ళికొడుకుల ప్రకటనలు నలుగురికీ తెలియజేస్తే" అని చిన్న పురాణం మొదలెట్టి, కళ్ళజోడు తగిలించుకొని "ఇంతకీ ఏం వేశాడు?" అని ఆత్రుతగా దీర్ఘం తీసింది.

ఇదుగో. నేను రాసినట్టుగానే.

"వధువు కావాలి. వరుడు అందగాడు. చురుకైనవాడు. వయస్సు 18 సం. లే అయినా మెట్రిక్ ప్యాసు అయ్యేడు. తినలేని తరగలేని ఆస్తి. వధువు చక్కగా ఉండాలి. జాతకాలతో పనిలేదు. లక్ష్మి కళ ఉంటే చాలు. చిరునామా . . . ."

అని గబాగబా కాఫీ త్రాగినట్టు చదివేసింది తార. వారపత్రికలో ఎడ్వర్టయిజుమెంటుని—తమ్ముడి పెళ్ళి గురించి.

"అయితే, అమ్మాయీ, ఇలా పేపర్లో వేయించుకుంటే మంచి సంబంధా లేవైనా వస్తాయంటావా? లేక చెల్లని నయాపైసా కాబట్టే పేపరు వరకూ ఎక్కిందిరా అని చులకన చేస్తారా?" అని చిన్న సందేహాన్ని వెలిబుచ్చింది తల్లి.

"అదేంటమ్మా, అలా అంటావు? ఎంత డబ్బున్నవాళ్ళు కాకపోతే మగపిల్లాడి పెళ్ళికి పేపర్లో వేయవలసిన అగత్యం వాళ్ళకే ముంటుందీ? మంచి ఆస్తిగల సంబంధాలు కావాలని వేసుకున్నారు" అని అనుకుంటారుగదుటే.

"ఏమోనమ్మా. ముసలిదాన్ని. వాడికి తండ్రి లేడు. తండ్రి అయినా, తోడు అయినా నువ్వే. వాణ్ణో ఇంటివాణ్ణి చేసి నా కళ్ళ పెడితివా సంతోషిస్తాను. లేదా ...." అంటూ కళ్ళు చెమ్మగిల్లుతూ ఉంటే దేముడివైపు తిరిగింది. కళ్ళజోడు విప్పి, కళ్ళు పంచె కొంగుతో తుడుచుకుంటూ.

"మరి కట్నంమాట వేసేవుకాదేం?" అని అడిగింది—తనకు రావలసిన లాంఛనాలు తగ్గిపోతాయేమో నన్నట్టు.

"రాసినదాంట్లో ఆ అర్థం ఉందే" అని ధైర్యం చెప్పింది తార ఎడ్వర్టయిజుమెంటుని మళ్ళీ మళ్ళీ చదువుకుంటూ.

"అమ్మా, ఇవాళ లేచినవేళ బాగుందే." అంటూ లోన ప్రవేశించాడు బాబు. వైజాగ్‌లో పి. యు. సి కి సీటు వచ్చిందే. నేలాఖరులోగా జీతంకట్టి, 7 వ తారీఖులోపల జాయిను కావాలన్నారు. ఏడుకొండలవాడా! నీ దయ" అంటూ మనస్ఫూర్తిగా సాష్టాంగం చేశాడు.

"చూశావా, నే చెప్పేను కదుటే—ఆ వైస్ ప్రిన్సిపాల్ గారికి మామిడిపళ్ళు పంపమని. నువ్వు ఇష్టార్తికొద్దీ చిన్న బుట్ట పంపేవు—చాలక గాబోలు తిరిగి తోలేసేరు. కాని ఆయన పని గట్టే పలే. పిల్లదగ్గర లాభట్టుకోవన్నని. మా ఆయన లేవ క్షయంట్లని ఇలాగే పనిగట్టేవారు." అని ఈ సీటు రావడం తన ప్రజ్ఞే అని విశదీకరించింది కూతురు.

"అక్కా, ఆయన దేముడిలాంటి మనిషిటే. అందరూ అలానే అంటున్నారే. నువ్వు పంపిన కుళ్ళు మామిడిపళ్ళకి మురిసిపోయే డంటావా?"

"త్రిప్పి పంపేశాడు కదురా?" అంది తల్లి అమాయకంగా.

"ఒరే, నీకు తెలియదురా. పైకి మంచిగా కనబడకపోతే ఎవ్వరైనా దగ్గర చేరతారా?" అంది అక్కగారు.

"నీకు అందరిమీద అపనమ్మకమే."

"లోక సహజాన్ని చూస్తున్నానుగా."

"నీ మోస్తరే లోకం కూడానా?"

"అందరూ అంతే. డబ్బు చూస్తే నీరయిపోవలసిందే."

"నీ ప్లీడరు బుద్ధి. ఆయన పోయినా, నీలో వేసిన అంటు పోలేదు."

"చూసేవే— ఆయన్నీ నన్నూ ఎలాదులిపేస్తున్నాడో" కళ్ళంట నీళ్ళ చుక్కలు.

"అక్కయ్య నలా చెప్పకూడదురా. అది చెప్పినట్టు వినుకోవాలి. నీ బాగోగులు చూస్తోందా మరి?"

"కాదే. శుభంగా సీటువస్తే, దేముడికి దండం అనో, ఆంజనేయస్వామికి కొబ్బరికాయలు కొడతాననో అనాలికాని, వైస్‌ప్రిన్సిపాల్‌కి మామిడిపళ్ళు పంపుతేసరి. ప్రిన్సిపాల్‌కి పాలకోవా పంపుతే సరి అని నిందలు వేయడం బాగుందా?"

"లోకం పోకడ తెలుసు కాబట్టే అంది. అయినా విన్ననలేదుగా,"

"అనవసరమైన నిందలెందుకూ అంట."

తల్లి చూపే సానుభూతికి, తమ్ముడి ఆగ్రహానికి ఫలితం—తార కళ్ళంబట నీళ్ళధార. ముఖం చీర కొంగులో దాగుండి పోయింది.

"పొద్దున్నే, నీ పెళ్ళి కబుర్లతో ఎంత పొంగిపోయిందో వెర్రితల్లి. దాన్ని ఒక్కలా ఏడిపిస్తున్నావు. పో, అవతలకి." అని కసిరింది తల్లి. మాట్లాడలేక వెళ్ళి పోయేడు బాబు.

* * *

మూడు నెలలు గడిచేయి. తీరికగా తల్లీ కూతురు జరిగిన దాన్ని స్మరించుకుంటున్నారు. మూడు సంబంధాలు వచ్చేయి. బాగానే ఉన్నాయి. పిల్లలూ బాగానే ఉన్నారు. అందులోనూ రేపల్లె సంబంధం మరీ బాగుంది. పిల్ల బొమ్మలా తీర్చి దిద్దినట్టుగా ఉంది. చక్కని పసినిమ్మ పండు రంగు. ముట్టుకుంటే కంది పోతుందేమో అన్నట్టుంది. నిజానికి ఆపిల్ల దగ్గర బాబే తీసిపోతాడను కున్నారు. వాళ్ళింట కూడా పిల్లకి ఒక్క అన్నగారు, తల్లితండ్రీ మినహా ఎవ్వరూలేరు. సాంప్రదాయం బాగుంది. పిల్ల తండ్రి బ్యాంకులో ఏకౌంటెంటుగా చేస్తున్నాడు. బాబు తండ్రి మాత్రం ఏం చేశాడు? ఇరవై ఏళ్ళ ఓ కంట్రాక్టరు దగ్గర పనిచేసి ఆఖరు దశలో కాంట్రాక్టులు పుచ్చుకునేవాడు. పిల్లకి సంగీతం కూడా వచ్చు. సంబంధమే ఖాయమైతే రోజూ కోడలి చేత రామదాసు కీర్తనలు పాడించుకో వచ్చునని లోలోపలే మురిసి పోయింది తల్లి.

"అయినా పాతిక వేలకే ఎలా ఒప్పేసుకుంటావు?" అని పేచీ లేవతీసింది తార.

"డబ్బులో ఏముందే—పిల్ల బాగుంటేను?"

"భలే దానివే. బంగారం లాంటి బాబుని పాతిక వేలకే చెల్లు పెట్టేస్తానా? ముప్పైపాతిక."

"వాళ్ళు ఏదో ఇస్తామన్నారుగా"

"ఊరకనే ఇస్తారా?"

"ఊరకనే ఎందుకిస్తారు? సంబంధం మంచిదని ముందుకొచ్చేరు."

"అదేనమ్మా నేనూ అంట. సంబంధం మంచిదని నలుగురికీ తెలుస్తే వాళ్ళలో వాళ్ళకి కాంపిటీషన్ మీద ధర పెరుగుతుందే"

"డబ్బు మనవాడార్జించుకోలేడే? మీనాన్న చూడు. వెయ్యి రూపాయిలు మదుపుతో మొదలెట్టి ఆ రామచంద్రమూర్తి సహాయంతో 'ల' కారం దాటించేరా?"

"బాగానే చెప్పేవు! మనవాడు చేతకాని వాడనా! చేతనైనవాడు కాబట్టే బిగించడం. ఇదే దద్దమ్మ అయితే వేరే మాట."

"మనడబ్బు వాడికి చాలదుటే."

"చాలదనా? నాన్న వ్యాపారానికి వెయ్యి ఎక్కడ్నుంచి ఒచ్చేయి? మీవాళ్ళిచ్చిన బాపతేనా? అలాగే—ఇప్పుడో ల కారమైనా ముడితే బాబు దాన్నో పది చేసుకుంటాడు. పదికాలాలపాటు సుఖపడొచ్చు."

"ఏమో, నీయిష్టం. నామట్టుకు ఆ రేపల్లె సంబంధం నచ్చింది. ఇంకా మంచి సంబంధాలు వస్తాయంటావు—నువ్వేచూడు" అని నిట్టూర్చింది తల్లి.

"నీకెందుకమ్మా, నే ఉన్నానుగా. ఆభారం నామీద ఒదిలిపెట్టు"

"డబ్బు సంగతెలా ఉన్నా, నాకు మాత్రం చక్కటి పిల్ల కావాలి. బాబు అదీ ఇంట్లో మెసలుతూ ఉంటే పండుగలా ఉండాలి. నే కోరేదంతే."

"నే చెప్తున్నాకదూ. రత్నంలాంటి పిల్లని తెచ్చి బాబుకి పెళ్ళి చేస్తాను. కావిళ్ళతో కానుకలు తెప్పిస్తాను. నువ్వు ఎత్తిన కాలు దించక్కర్లేకుండా చూస్తాను. చాలా?"

"ఏమో, సరేలే. ఇంతకీ రామ నిర్ణయం?... రామా, రామా.." అంటూ చాగోరింది.

తార తన పెద్ద కూతురు. పెద్దదేమిటి—ఒక్కతే. అది పుట్టిన పదిరోజులకే పెద్ద కాంట్రాక్టు వచ్చిందని, రోజులు బాగుంటాయని చిహ్నంగా 'తార' అని పేరు పెట్టాలన్నారు ఆయన. అలాగే రోజులు బాగుంటూ వచ్చేయి. తారకి పదేళ్ళయ్యే సరికి నాన్నకి మిలటరీ కాంట్రాక్టులందుకున్నాయి. కానీ, పరకా చేసుకున్నాడు. మరి పదేళ్ళకి తారని ఓ లాయరు చేతులో పెట్టేడు—పాతికవేలు లాంచనాలతో సహా ఇచ్చి. తార ఏడేళ్ళ పాటు కాపరం చేసింది. దివ్యంగా వెలిగింది. భర్త కుటుంబరావు ఉత్త సత్తగుల్ల. భార్య దగ్గరకూడా భయమే. అసలే తారకి నోరు పెద్దది. చెప్పు చేతల్లో ఉండేవాడు. ఆయన వింటున్న కొద్దీ మరీ నొక్కడం మొదలు పెట్టింది తార. ఇంటి ఖర్చంతా తన చేతులమీద నడవవలసిందే. సిగరెట్లకి మాత్రం ఏభై రూపాయలు అడక్కుండా

ఇచ్చేది. స్నేహితుల కెవరికైనా కాఫీ ఇవ్వాలంటే అందులో మిగిల్చి ఇచ్చుకోవలసిందే. క్రమేణ తన అధికారాన్ని పెంచుకోడం మొదలెట్టింది తార. ఇద్దరు గుమాస్తాల్లా కేసులన్నీ తనకు చెప్పాలి. ఎక్కడ ఎంత పైకం పేలుతుందో, పేలాలో చెప్పాలి. తను కావాలనుకున్నంతా భర్త పుచ్చుకోవలసిందే. తక్కువయితే భర్త సమ్జాయిషీ ఇచ్చుకోవాలి. క్లబ్బుకి ఏ రోజు వెళ్ళాలో, ఏ రోజు మానాలో తన ఇష్టమే. తన స్వాతంత్ర్యంలోకి ఇంత చొరవ చేసుకోవడం కుటుంబరావుకి నచ్చలేదు. చాలా సార్లు చెప్పి చూసేడు. డబ్బు కావాలంటే అంతా తీసుకోమన్నాడు. కాని మగాళ్ళవ్యావహారాలలోకి రావద్దన్నాడు. బ్రతిమాలి చెప్పేడు గాని లాభం లేక పోయింది. తారది రాజకీవి. తలవంచడ మన్నది చేతకాదు. కాలుకి తప్పితేమెడకి, మెడకి తప్పితే కాలుకి బంధం వేసేది. "పెళ్ళి అంటే చేసుకున్నారు గాని నామీద అభిమానం ఉంటేగా నేచెప్పిన మాటవినడానికి అనేది. ఆవంతా లాభం లేక పోతే "మీకన్న నాకెవ్వరున్నారు? మీరు ఆరోగ్యంగా ఉండి ఐశ్వర్యంలో ఉండాలనేగా నా కోరిక" అని మొదలెట్టేది. అంతేకాని భర్త నేవిధంగా తను నొప్పిస్తున్నది ఆమెకు అవగాహన కాలేదు. తన మనస్సులో ఉన్నది జరిపించడమే తెలుసుకాని, ఎదుటివాళ్ళు ఏమనుకుంటున్నారో అనవసరం. దానికి తోడు పెళ్ళై ఏడేళ్ళైనా కడుపు పండలేదు. "నాకో పాప కావాలండీ" అని వేధించడం మొదలెట్టింది. డాక్టరుకు చూపిస్తానంటే పనికి రాదని పంతం పట్టింది. ఎన్నోదేముళ్ళకి మ్రొక్కుకుంది కాని ఏ దేముడూ కరుణించలేదు. ఫలితంగా భర్త మీద దెప్పిలెక్కువయ్యాయి. "మీరూ మగాళ్ళేనా? ఊళ్ళో మగాళ్ళయితే ఇంట్లో మగాళ్ళా పెళ్ళాడరు పని చేతనయినా పిల్లల్ని కనడం చేత కావద్దూ?" అని అందుకునేది. కుటుంబరావు పరిస్థితులకి లోనైపోయేడు. పెళ్ళైన కొత్తలో మెత్తగా ఉండడం వల్లనే ఇప్పుడీవిడ ఇలా తయారైందను కున్నాడు. సంసారం, చదువు, సంగీతం, వేదాంతం ఏమైనా చెప్పి చూసేడు. కాని ప్రయత్నాలన్నీ బూడిద మీద పోసిన పన్నీరు. కొనకి ఆయనకు దక్కింది—బుడ్డి. ఏ సుముహూర్తాన్న మొదలు పెట్టేడో రాకెట్‌లా స్పీడు అందుకున్నాడు.

# వధువు కావాలి

బుడ్డి అలవాటు రోజుకి రోజుకి పెరిగింది. మూడేళ్ళలో తననే ముంచేసింది—తారమ్మ కుంకం బొట్టు చెరిపేసింది. మాటు మణిగిన తారని చూసి సంవత్సరం తిరక్కుండా తండ్రి కళ్ళు మూసేడు—తన జీవితంలోని తారే రాలిపోయిందన్న వ్యాధితో.

కష్టాలన్నీ తల్లికళ్ళముందు స్క్రీను లేకుండానే సినిమాలాగ తిరిగేయి. కనుకొలకుల్లో నీళ్ళు చేరేయి. "చూడమ్మా. చిన్నపిల్లాడు. తండ్రీ, తోడూ నువ్వే" అని రెట్టించింది.

సంబంధాలు వస్తూనే ఉన్నాయి. కాని ఏదీ పాతికవేలకు మించడంలేదు. తారమ్మకి చిరాకు, నిస్పృహ కూడ వస్తున్నాయి. ముక్కోటి ఆంధ్రుల్లోనే ముచ్చటైన సంబంధాలే లేవా అనుకునేది—ముక్కోటి ఆంధ్రులూ పి.యు.సి.చదువు తున్న తమ్ముణ్ణి వెదుక్కుంటున్నట్టు. తమ్ముడు పి.యు.సి.ప్యాసయితే సంబంధాలు కలిసి వస్తా యనుకుంది. కాని తొలియేడు ఇంగ్లీషులో తప్పేడు. "ఇలా అయితే ఏం లాభం? పాడై పోతావు" అని తమ్ముడిని హెచ్చరించింది. ఎలాగైతేనేం రెండో మాటు పి.యు.సి. గట్టెక్కేడు బాబు. అంతేనా—విశాఖపట్నం ఇంజనీరింగు కాలేజీలో సీటు వచ్చింది. ఇంకేం—మరో నెల్లాళ్ళకి—పేపరులో

"వధువు కావాలి—విశాఖపట్నంలో ఇంజనీరింగు చదువుతూన్న స్ఫురద్రూపికి, ఆస్తిపరునికి. సరితూగే సంబంధం చక్కటిది సాంప్రదాయమైనది లక్ష్మీకళతో సహా. చిరునామా......"

పేపర్లో పడ్డ ఎడ్వర్టయిజుమెంటు తల్లి వద్ద పదే పదే చదివింది. తన చేయబోతున్న నిర్వాకానికి తనే మురిసిపోయింది. తననెత్తిన ఉన్న బాధ్యత తను కాబట్టే మోస్తున్నట్టు గర్వించింది.

"ఏమిటోనండి, మాతమ్ముడి పెళ్ళి ఖాయపర్చే వరకు నాకు కునుకు పట్టదండీ" అని పక్కఇంటి వదినగారితో కనీసం రోజుకు ఒక సారయినా అనేది.

సంబంధాలు కుప్పలుగా వస్తున్నాయి. తారమ్మకి వాటిని పరీక్షించడమేపని. చదువు, చక్కదనం, సంస్కృతి, సాంప్రదాయం, కట్టు, కలుపుగోరుతనం ఎన్నని చూడాలి! పైగా తమ్ముడు ఇంజనీరుగామరి — పిల్లకి ఉత్త సంగీతం చాలదు. ఆటలేవైనా రావాలి, మాటకారి కావాలి. మళ్ళీ ఇంట్లో మెత్తగా ఉండాలి. వీధులో చదువుకున్న పిల్లలా కట్టూ కవ్వా ఉండాలి. ఇంట్లో గుట్టూ గుంభనా ఉండాలి. ఒకవేళ వాడు ఏ చీఫ్ ఇంజనీరో అయితే క్లబ్బులో ఉపన్యాసలిచ్చే ధైర్యం ఉండాలి. ఫారిన్ వెళ్ళవలసి వస్తే ఇంగ్లీషు బాగా రావాలి. దూరాభారాలకి బదిలీ అయితే ఒక్కతేరైలు ప్రయాణాలు చేయగలగాలి. అబ్బబ్బ—ఎన్ని పాయింట్లు చూసుకోవాలి. చూస్తున్న కొద్దీ తారమ్మ తల వేడెక్కి పోతుంది. ఈ ఇంజనీర్లు ఎంత చులాగ్గా తమ భార్యల్ని ఎంచుకుంటారో అని అప్పుడప్పుడు విస్తు పోయేది. ఏమైనా సరే తనూ తమ్ముడికి అన్యాయం చేయలేదు. బంగారం లాంటి సంబంధం చూసితీరుతుంది. తప్పదని కంకణం కట్టుకుంది.

వేసవి సెలవులకి తమ్ముడింటికి వచ్చేసరికి తారకి పని ఎక్కువయ్యేది. రోజులు గడుస్తున్న కొద్దీ ధరలు పెరిగి పోతాయని పెళ్ళి చూపులకి పిల్చే కన్యాదాతలు తల్లిపేరున తారమ్మకు కబుర్లు పంపేవారు. ఒద్దు, మొర్రో అన్నా, వచ్చిన సంబంధాల్ని, ఆడపిల్లల్ని చూడక తప్పేదికాదు బాబుకి. "ఈ పెళ్ళి నీకొక్కక పోతే నాకురా? నువ్వు చూడకపోతే ఎలా ?" అని తమ్ముణ్ణి పొడిచేది.

"చదువాపి పెళ్ళి చేసేసుకోమంటావా ?" అనేశాడు బాబు ఆఖరికి.

"చదువులేక పోతే మంచి సంబంధాలెలా వస్తాయి?"

"అయితే చదువుకోనియ్యి"

"ఈ లోపల మంచి సంబంధాలు మనకు తెలియకుండా చెయ్యిదాటిపోతే."

మాట్లాడలేక పోయేడు బాబు.

"చూడు బాబూ, చదువు చదువుకుంటూ ఉండాలి. పెళ్ళికి వలవేసి ఉంచాలి. అసలైన సంబంధం చిక్కిందా, అప్పుడే చదువుకి స్వస్తి చెప్పొచ్చు."

"అయితే చదువు దేనికంటావు?"

"దద్దమ్మా, చదువుకుంటూ నీకేతెలియదా? కాబోయే అల్లుడు గొప్పవాడని చెప్పుకునేందుకు నాలుగు డిగ్రీలుంటే—మామగారు నాలుగు రాళ్ళు వడేస్తాడు."

"ఆ రాళ్ళు మనం ఆర్జించుకో కూడదా?"

"మామగారిస్తే మాత్రం వేరే మనం ఆర్జించుకోకూడదా?"


తార చిలిపిరి తనానికి జాలి పడ్డాడు బాబు. చేసేది లేక చిరునవ్వు ఒకటి పారేశాడు.

"తారక్కా, నీ బుర్ర భలే బుర్రే. ఇంగ్లీషులో "బ్రెయిన్సు" అంటారు" అన్నాడు. ఇన్నాళ్ళకి తన ప్రయాసంతా తమ్ముడర్థం చేసుకుంటున్నాడని భ్రమించింది.

"ఓరేయ్. ఇంకా చూద్దువుగానిరా— నిదానంగా ఆలోచిస్తే నాతడాఖా." అని ధీమాగా చెప్పింది.

తమ్ముడు తనుచెప్పిన దారికి వచ్చేస్తున్నట్టే. తను చూడమన్న సంబంధం చూస్తున్నాడు. వద్దంటే మానేస్తున్నాడు.

నాలుగేళ్ళు ఇలాంటి తర్జన భర్జనలతో, పరిశూన్యమైన చూపులతో గడిచిపోయేయి. మిగిలిన



# వధువు కావాలి

తల్లా తారమ్మ ఆడపిల్లల వాళ్ళని పెట్టిన రోత. ప్రతి సంబంధానికి తనూ వెళ్ళేది— వెనక అండగా తమ్ముడికి. పెరటేంట్లో కాబోయే మరదలిని గంటకి తక్కువలేకుండా ఇంటర్వ్యూ చేసేది. అడ్డమైన ప్రశ్నలు వేసేది. సంగీతం వచ్చు నంటే, వెస్టర్న్ మ్యూజిక్ వచ్చునా అనేది. కుట్లు వచ్చునంటే క్రాస్ స్టిచ్ వచ్చునా అనేది. అల్లిక వచ్చునంటే పుల్ఓవర్స్ అల్లగలవా అనేది. వంట వచ్చునంటే ఇంగ్లీషు డిషెస్ వచ్చునా అనేది. "పుస్తకాలు చదివి వండుతావా?" అని అడిగేది— అవునంటే "అయ్యో! ఆ మాత్రం కూడా రాదా?" అని పెదవి విరిచేది. "అక్కర్లేదు. మనవంటలు వచ్చునంటే"— "బాగుంది. పుస్తకాలు చూసి కొత్తవంటలు నేర్చుకోపోతే ఎలా?" అనేది. "షికారు కెళతావా— తమ్ముడితో?" అని అడిగేది. "అలాగే అయనిష్టం" అంటే "ఇలాగనే వాడిని పాడు చేస్తావు కాబోలు" అనేది. "ఆడపిల్లకి షికార్లెందు కమ్మా?" అని ఎవరైనా అంటే "సరిసరి. మా వాడు ఇంజనీరవుతాడు కదా. భార్య బయటికి రాదంటే నలుగురిలో తలెత్తుకో గలడా?" అనేది. "అమ్మని చూడ్డానికి పుట్టింటికి పదేపదే వరు గెడతావా అని అడిగేది. "అప్పుడప్పుడు అయన ఒప్పుకుంటే?" అంటే "ఇప్పట్నుంచే బేరం పెడు తున్నావా?" అనేది. "అయన్ని వదలి ఎలావెళ్ళ గలను?" అంటే "అలా అయితే మీ ఆరోగ్యాలు చెడిపోవూ?" అనేది. ఐ. ఎ. ఎస్ పరీక్షలా రుబాడించి ఒదిలి పెట్టేది. ఎన్ని సంబంధాలు చూసిందో— కాని, అన్నిటికీ ఒక్కటే సమాధానం "ఇంటి కెళ్ళి జాతకం చూపించి జవాబు వ్రాస్తాం" అని. ఆ జాతకాలు ఎప్పటికీ సరిపోయేవి కాదు. దేముడు వరమిచ్చినా, పూజారి ఇవ్వొద్దూ?

సంబంధాల వాళ్ళకి సమాధానా లివ్వడానికి తారమ్మ చిన్న ఆఫీసు లాంటిది పెట్టుకుంది. సంబంధానికో ఫైయిలు— (లాయరు గారి భార్యగామరి). రోజూ టపా. వచ్చిన ఉత్తరానికి పదిరోజులలో జవాబు. జాతకాలు శాస్త్రుల్లుగారు చూస్తున్నారనో, శాస్త్రుల్లుగారి అబ్బాయికి ఒంట్లో బాగులేక ఇంకా చూడడం కాలేదనో— (ఇంకో శాస్త్రుల్లు గారెవరూ పనికి రానట్టు), అబ్బాయి జాతకం ప్రకారం ఆరునెల్ల వరకు పెళ్ళి ప్రయత్నం కూడదనో, మేమంతా నచ్చినా మా మేనమామకు నచ్చలేదనో (మేనమామ లేకపోయినా), ఇల్లా ఏవేవో డొంక తిరుగుడు కారణాలు చెప్పే సమాధానాలు. ఇంత హడావిడిలోనూ ఆవిడ కన్నుల్లా ఒక్క పాయింటు మీదే ఉండేది — ఏమాత్రం ఇస్తామన్నారు? ఎంత వరకు ఇవ్వగలరు? ఆమె అనుకున్నట్టే ఏటేట ధర పెరిగింది. ఇంజనీరింగు నాలుగో ఏడు అవుతూందనే రోజుల్లో లకారం వరకు వెళుతూంది. వెంటనే ఒప్పుకొని పెళ్ళిచేసుకుంటే లక్ష కూడ ఇచ్చేస్తామని మైలవరంవాళ్ళు వచ్చేరు. కానివాళ్ళు ఏభైవేలకి మామిడి తోటలూ, పాతికవేలకి నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్లు పాతిక వేలు నగదు ఇస్తామన్నారు. అందులోనూ తోటలూ సర్టిఫికేట్లు పిల్ల పేరునట. తారమ్మకి గిట్ట లేదు. లక్ష రొక్కం ఇచ్చి, ఆపైవి పిల్లపేరున ఏం రాసుకున్నా తనకు రాజీయే.

కాని ఈమధ్యన వస్తున్నసంబంధాలేవీ తల్లికినచ్చడం లేదు. ఏసంగతులెలా ఉన్నా పిల్లలు తీరుగాఉన్నట్టు ఆవిడకి కనపడ్డంలేదు. బక్కపల్చగా ఉందనో, రంగు తక్కువనో, పలువరస బాగులేదనో, కళ్ళు చిన్నవనో కాళ్ళువంకరనో, నుదురు చిన్నదనో, జుత్తు తక్కువనో ఏదో లోపం కన్పించేది. పిల్లలకి అంత వయస్సు వచ్చిన వరకూ పెళ్ళికాకపోతే బెంగపెట్టుకొని ఇలా తయారవుతారని ఆవిడ నమ్మకం. ఏపిల్లా కూడా రేవళ్ల సంబంధాన్ని పోలిలేదని రెండు మూడు సార్లు కూతురుతో అంది. కాని లాభం లేకపోయింది.

"అదేంటమ్మా, నేను లక్షలకి పరుగెడుతూ ఉంటే నువ్వింకా వేలలోనే ఉన్నావు? ఏం— ఆ మైలవరం పిల్లకేం తక్కువ? మనం ఒప్పు కోవాలిగాని వాళ్ళు సిద్ధమే. అటు ఏలూరు వాళ్ళో— బంగారంలాంటిపిల్ల. మరో ఇరవైవేలకి వెనక తీస్తున్నారంతే. నువ్వూరుకో — తమ్ముడి పరీక్ష కానీ. నిక్షేపంలాంటి సంబంధం కూర్చేస్తాను" అని ధైర్యం చెప్పేది తార.

"ఏదో ఒక నిశ్చయానికి రాకూడదుటే?"

"నేనా? నాకేం? వాడు దేనికీ ఒప్పుకోవడం లేదు." అని తప్పించేది.

*　　*　　*


తమ్ముడు చదువుకోసం నాలుగేళ్ళు ఎంత కష్టపడ్డాడో, వాడిపెళ్ళికి అంత ప్రయాస పడ్డది తార. తమ్ముడి పరీక్షలై పోయేయి. మర్నాడు తెల్లారి ఉదయం ఎక్స్‌ప్రెస్‌లో తమ్ముడు వచ్చే స్తాడు. ఈ లోపున వ్రాయవలసిన జవాబులన్నీ రాసేయాలి. రెండుమూడు సంబంధాలు ఎంచి తమ్ముడికి చూపించాలి. ఇల్లు శుభ్రం చేయాలి. తార త్వరగా నడుంకట్టుకుంది. ఒక్క కప్పు కాఫీ తాగి పని మొదలెడదామనుకుంది. పోస్టు మేన్ అరు ఉత్తరాలు తెచ్చేడు. త్వరగా విప్పింది. ఒకటి ప్రీమియమ్ నోటీసు. రెండోది ఎలక్ట్రిక్ బిల్లు. మూడోది ఎలక్ట్రిక్ షాక్‌లాంటి ఉత్తరం. చదువుతూనే ఉత్తరాలకట్ట చేతో పట్టుకునే కూర్చో బడి పోయింది. రెండుమూడు మాట్లు కళ్ళు చీకట్లు కమ్మేయేమో కూడ ఆవిడకే తెలియదు. ఉత్తరమా, కలా అనుకుంది. ఇంత దారుణమా అనుకుంది. ఒళ్ళంతా ఒణికి పోయింది. నోరార్చుకు పోయింది. "తమ్ముడూ!" అని కేక పెట్ట బోయింది, నోటంట మాట రాలేదు. తమ్ముడు కాదు, చండాలుడనుకుంది.

"తారక్కకి—నమస్సులు. క్షమాకాంక్ష.

ఈ ఉత్తరం చదువుతూ ఉంటే తారు తాగు తున్నట్టుంది. నువ్వు నిప్పులు తొక్కుతావని నాకు తెలుసు. కాని నేను కూడా మసిపిన బజార్లో అమ్ముడు పడడానికి నేనేం బెల్లం ముద్దకాదు. నాలోనూ రక్తం అంటూ ఉంది. ఆ మధ్య షికారుకి బీచికి వెళ్ళేను. దూరాన ఇద్దరమ్మా యిలు ఒకరినొకరు ఫోటోలు తీసుకుంటున్నారు.

ఇద్దరికీ కలిపి నేను తీస్తానన్నాను. సరేఅన్నారు. అందులో ఒక పిల్ల పేరు ప్రవీణ. వీణ అని అందరూ పిలుస్తారుట. అక్షరాలా వీణలా ఉంది. సముద్రం ఒడ్డున గులాబిరంగు చీరలో వీణ కూర్చొని వాల్జడ ముందుకు వేసుకుంటే, వీణ తంతుల్లా కురులు కదిలేయి. జడలో పువ్వులు మీటల్లా మెదిలేయి. గానతరంగాలు సముద్రపు కెరటాల హోరుని ముంచేసేయి. ఆ గానంలో నేను లీనమై పోయేను. మహా సరస్వతికే అలంకార మైన వీణ వద్ద నా మనస్సులోని మల్లెమొగ్గని అర్పించాను. ప్రవీణ నవ్వింది. మొగ్గ విరిసింది. తంతి మ్రోగింది. వీణ పాడింది నేను నాట్యం చేశాను. అంతా క్షణాల్లో జరిగింది. రెండోపిల్ల "మీకు మతి చలిస్తూందే" అనే వరకు మాకు తెలివిరాలేదు. తెలివొచ్చినా మా చూపులు ముడి పెట్టుకునే ఉన్నాయి.

నువ్వు మళ్ళీ ఇంకో ఎడ్వర్టయిజుమెంటు సిద్ధపరచేవేమో. క్షమించి చించెయ్యి. వీలైనంత త్వరలో ముహూర్తం పెట్టించు—పెళ్ళికి కోడలు బాగుంటుంది. అమ్మకు నచ్చుతుందని అమ్మతో



చెప్పు. ఇంగారు పడకు. నేను సోమవారం ఉద
యానికి వస్తాను. వీణ మూడు రోజుల్లో మనని
చేరుకుంటుంది. ఆపైని మన ఇష్టం.

వీణ కుటుంబ పరిస్థితి. .....................
డబ్బు తక్కువ పిల్ల అని నిర్లక్ష్యం చేస్తే
బాగుండదు.

క్షమిస్తున్నావు కదూ నన్ను?

ఇట్లు

.....................

కులభ్రష్టుడు! అని తిట్టుకుంటూ, చదవలేక అమ్మ దగ్గిర ఆ ఉత్తరం చదివింది. ఆ రోజల్లా తోకతొక్కిన త్రాచులా ఉంది. వీణ—వీణకాదు, బాణం, శూలం—ఇంటికి రాగానే ముక్కలుగా చెక్కి ఇంటికి పంపించాలి—పరువు, ప్రతిష్ఠ......... నిజం తెల్సుకోవాలి. కిట్టని వాళ్ళెవరైనా వ్రాసేరేమో అని సముదాయించింది తల్లి—కాని వ్యర్థం.

తెల్లవారింది. యుద్ధానికి సిద్ధమవుతోంది తారమ్మ. తమ్ముడు టాక్సీ దిగి సామానింట్లో పెట్టగానే తగులుకుంది—

"ఏంరా, ఆ ఉత్తరం నువ్వే వ్రాసేవా?"

"ఎందుకా అనుమానం?"

"అవునులే. అంత అఘాయిత్యానికి తలపెట్టిన వాడివి—ఈ ఉత్తరం వ్రాయడం నీకెంత?"

"నే చేసినది అఘాయిత్యమా?" అని నవ్వేడు బాబు.

"నీకేం—నవ్వుతావు. సిగ్గు విడిచిన పీనుగ. తండ్రి లేడు కదా అని నెత్తిన భారం వేసుకుంటే కొసకి తల గొరిగేవా?"

"ఆ భారం నీ కొద్దని నేచెప్పలే."

"ఆ కూతలు ముందే కుయ్యి లేక పోయేవు—ఆడదాన్ని చూడగానే అయిపయి పోయిన మొగాడివి."

"ఏం, నువ్వు డబ్బు చూస్తే అయిపయి పోవడంలే?"

"విశాఖపట్నం వెళ్ళి మాటలు నేర్చేవులే."

"లేక, నీలా ఓ మూల కూర్చొని నన్ను నేను మోసంచేసుకోనా?"

"ఈ కబుర్లు నీకు అదే నేర్పిందా—గొల్లకుంక"

"గొల్లకుంక కాదు గొల్లభామ. భామిని—నా మనోయామిని."

వాకిట్లో కొడుకు గొంతుక విని తల్లి ఇవతలికి వచ్చి

"ఏంరా బాబూ ఇంత మారి పోయేవు?" అని దీనంగా అడిగింది.

"లేదమ్మా, నేనేం చేసినా నువ్వు సంతోషించాలి" అని వంగి తల్లికి నమస్కరించేడు. "ముహూర్తం పెట్టిస్తున్నారా?"

"ముహూర్తం కాదు నా శ్రాద్ధం" అని అందుకుంది తార మళ్ళీ. "నువ్వు ఇలా ఘోరం చేస్తావనుకోలేదురా. నాపీక తీసేసేవురా. 'వధువు కావాలి' అని ఎన్ని ఎడ్వర్టయిజుమెంట్లు వేయించేను?"

తార భరించ లేకపోయింది. భోరున దుఃఖం వచ్చింది— తన చులకనకి. బావురుమని ఏడ్వాలనిపించింది. కాని కన్నీటి చినుకులతో కట్టేసింది.

వాకట్లో కారాగిన చప్పుడు. మెట్లు వరకూ పరుగెత్తాడు బాబు. "రా, వీణా, రా. నీ గురించే చెప్పుకుంటున్నాం" అన్నాడు.

తార, తల్లి విస్తు పోతున్నారు. కొయ్యలైపోయేరు. ఎవ్వరూ పలకరించలేదు. ఇదా వీణ అని చెప్పవాల్సకుండా నుంచున్నారు. బాబే మొదలెట్టాడు. "అమ్మకి దండం పెట్టు" అని.

తల్లి ఆశ్చర్యంతో—

మీది రేపల్లె కదమ్మా."

"అవునండి"

"మీ నాన్నగారు ఎకౌంటెంటు"

"ఆఁ—వెంకటేశ్వరరావు గారండి"

ఒళ్ళు మర్చి పోయింది తల్లి. తన్ను తను నమ్మలేక పోయింది. అమాంతంగా వీణని ఒళ్ళోకి తీసుకొని గట్టిగా కౌగిలించుకొంది. తొలి చూపుల విశేషమేమో. ఆ తల్లి చూపిన ప్రేమలో, వాత్సల్యంలో ఉక్కిరిబిక్కిరైంది వీణ.

"నీ మనస్సు నాకు తెలుసమ్మా" అన్నాడు బాబు.

"ఎలా చేసేవురా ఇదంతా!"

"ఏం. నీకు నచ్చిందన్నావుగా. ఆయేడే రేపల్లె వెళ్ళి వాళ్ళనాన్న గారితో అన్నీ ఖాయం చేసేను. కాని పిల్ల పల్లెటూళ్ళో పెరుగుతే లాభంలేదు. విశాఖపట్నం పంపించి యూనివర్సిటీలో చదివించమన్నాను. ఆయనే నాకూ ఇంజనీరింగులో సీటు తెప్పించారు. దాన్ని కాలేజీలో జాయిను చేసేరు. దాని బాధ్యతా నాదే. అలాగే నాలుగేళ్ళు గడిపేసేం. వీణకి నేను నచ్చకపోయినా, వాళ్ళ నాన్న బలవంతాన తప్పలేదు"

తల్లీ, కొడుకూ కోడలు ఘల్లున నవ్వేరు.

ఈ అముదం తాగలేక "ఈ ఏడుపు మొదటే ఏడవ రాదూ? నాకీ బాధా, అవస్థా తప్పేవే!" అంది తార.

"చూడక్కా. పెళ్ళాడేవాణ్ణి నేను. పిల్ల నాకు కావాలి. డబ్బు నీకు కావాలి. మేం వైజాగ్ వెళ్ళిన ఏడాదే వీణ అన్న పోయేడు. కొడుకయినా, అల్లుడయినా నువ్వే అని వాళ్ల నాన్నగారు ఆస్తి అంతా వీణకి, నాకురాసేసేరు. వీణకి ఆస్తి, నాకుంరొక్కం."

"ఆఁ. ఏమాత్రం ఉంటుందిలే. ముష్టి పాతిక వేలతో మొదలెట్టేరు."

"అలాగా. ఇదుగో చూడు పాస్‌బుక్. లక్షన్నర దగ్గరగా ఉంది. చాలా?" తార గుడ్లు తేలేసింది. "నే చెప్పేను కదుటే వీడిలాంటి పనేదో చేస్తాడని. అన్నీ నా గుణాలే. నీకూ, నాకూ నచ్చిన సంబంధం తెచ్చేడు. బంగారంముద్ద. ముత్యాలమూట" అని బుగ్గలు నిమిరింది.

"ఇంకా అడగవేం. వచ్చేనెల ఇద్దరం జపాను వెళుతున్నాం. నాకో కంపెనీలో ట్రెయినింగ్‌కి ఏర్పాటుచేశారు వీళ్ళ నాన్న. సూదితో దారం వీణ."

"ఆఁ ఆఁ. నే అనుకున్నారే. నువ్వెంతకైనా తగుదువని."

"సరేకాని, అక్కా, నువ్వింతమంది ఆడపిల్లల్ని అల్లరిపెట్టి అవస్థ పెట్టేవుకదా! ఇంక కలం వదిలి గరిట పట్టుకుంటే ఎంత బాగుంటుందే!"

అంతా నవ్వేరు.

"రా, అమ్మా ఒక్క రామదాసు కీర్తన పాడు" అని తల్లి వీణని కూర్చోపెట్టింది.


"ఇప్పుడు కాదు" అని తల్లి ఒళ్ళో తలదాచుకుంది వీణ.

"ఆ ఒళ్ళో కాదు. నా వొళ్ళో పడాలి" అన్నాడు బాబు.

"మొండి ఘటమా" అంది తార. ★


పండిత
డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

మంచి పుస్తకాలు
జీవిత రహస్యాలు:- మీ దాంపత్యసుఖానికి అనేక కామ సూత్రాలు :—...... రూ. 3-50.
యువతి :- స్త్రీలను గురించి అనేక కుతూహల విషయాలు......రూ. 3-50.
సంతానము:- గర్భనిరోధానికి 60 నవీన సులభ మార్గాలు............రూ. 3-50.
పోష్టు ఖర్చులు చితం. క్రింది ఎడ్రస్సుకు వ్రాస్తే వి. పి. పోష్టుద్వారా మీయింటికి పంప బడును.
దేశసేవ ప్రచురణలు, ఏలూరు, (ఆంధ్ర)



మీదురద బాధను ఒక్క రోజులో పోగొట్టవచ్చు. దురదలు, గజ్జి, తామర, కురుపులు, గాయాలు, దెబ్బతగిలిన వ్రణాలు, మొటిమలు. క్లోరోఫిల్ కలసిన జర్మెక్స్ వల్ల సులువుగా మానిపోతవి. - ఇది చర్మం కుళ్లిపోకుండా నివారిస్తూ, వ్యాధిని నిర్మూలించే గొప్ప గుణం కలిగిన అంజనం. జ్ఞాపకం వుంచుకోండి: జర్మెక్స్ మంట పుట్టించేది కాదు, మచ్చ పడనివ్వదు.

